సాక్షి
కర్నూలు
బుధవారం । 8 । మార్చి । 2023



న్యూస్‌రీల్

కర్నూలులో పెద్ద ఎత్తున పరిశ్రమలు


మాట్లాడుతున్న ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్

కర్నూలు(రాజ్ విహార్): కర్నూలులో పెద్ద ఎత్తున పరిశ్రమలు నెలకొల్పేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు చేపట్టారని కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక వెంకటరమణ కాలనీలోని ఆయన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లాలో 10 వేల ఎకరాల్లో పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయని, దీంతో వేల మందికి ఉద్యోగ,ఉపాధి అవకాశాలు లభించనున్నాయని చెప్పారు. విశాఖపట్నంలో జరిగిన పారిశ్రామికవేత్తల సమ్మిట్ గ్రాండ్ సక్సెస్ అయిందని, రాష్ట్రంలో రూ.13.41 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చారన్నారు. ఇదంతా సీఎం జగన్ దూరదృష్టి, కల్పించిన భరోసా కారణంగానే సాధ్యమైందని చెప్పారు. దీనిని చూసి ఓర్వలేక చంద్రబాబు బృందం ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రచారం చేయడం విచారకరమన్నారు. ఇప్పటికైనా వారు తీరు మార్చుకోవాలని సూచించారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం


విద్యార్థినులను పరీక్షిస్తున్న వైద్యులు

కర్నూలు(అర్బన్): రక్త హీనతను అధిగమించి ఆరోగ్యంగా ఉండేందుకు పౌష్టికాహారం తీసుకోవాలని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వైద్యులు సూచించారు. మంగళవారం ఉదయం స్థానిక కలెక్టరేట్ సమీపంలోని ఎస్సీ బాలికలు, ఆనంద నిలయం ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థినులకు వైద్యులు వెంకటరమణ, మాణిక్యరావు, సుధాకర్, మమత, సుగున, మాధురి, సిబ్బంది రక్త పరీక్షలు నిర్వహించారు. రక్తహీనత ఉన్న వారికి అవసరమైన మందులు అందించారు. కార్యక్రమంలో మెడికల్ రెప్ గజేంద్ర, వసతి గృహ సంక్షేమాధికారిణులు డీపీ సులోచన, రజని పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన ఇంటర్ ప్రాక్టికల్స్

నంద్యాల(సిటీ): పది రోజులుగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో జరుగుతున్న ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్స్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. 200 కేంద్రాల్లో జరిగిన పరీక్షలకు 69,750 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 68,095 మంది హాజరయ్యారని ఆర్ఐఓ గురువయ్య శెట్టి మంగళవారం తెలిపారు. ఇంటర్ సెకండ్ ఇయర్ జనరల్ విద్యార్థులు 149 కేంద్రాల్లో 64,483 మందికి గాను 63,056 మంది, అదేవిధంగా ఒకేషనల్ విద్యార్థులు 51 పరీక్షా కేంద్రాల్లో 5,267 మందికి గాను 5,039 మంది హాజరయ్యారన్నారు. మొత్తం1,655 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారన్నారు.

ఆమేయ శక్తి

- అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు
- నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

ఆమె అమ్మలా లాలిస్తుంది.. సతీమణిగా సలహాలు ఇస్తుంది.. చెల్లిగా ధైర్యాన్ని ఇస్తుంది.. పోలీస్ అధికారిగా శాంతిభద్రతలు కాపాడుతుంది.. రంగం ఏదైనా అవకాశాలను అందిపుచ్చుకోవడంలో మహిళలు ముందుంటున్నారు. పురుషులతో సమానంగా ప్రతిభ కనబరుస్తూ ప్రశంసలు అందుకుంటున్నారు. తమ 'ఆమే'య శక్తితో అద్భుతాలు సృష్టిస్తున్నారు. సమాజాభివృద్ధిలో కీలకంగా మారుతున్నారు. నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తరుణీమణుల విజయ, స్ఫూర్తిదాయక గాథలు..

రెక్కల కష్టం.. రహిమూన్ విజయం



ఈ చిత్రంలో వరి పంటకు రసాయన ఎరువు చల్లుతున్న మహిళ పేరు కొత్తూరు రహిమూన్. ఈమె ఉయ్యాలవాడలో నివాసం ఉంటున్నారు. భర్త ఇమాం ఉసేన్ అనారోగ్య సమస్య కారణంగా వ్యవసాయం చేస్తూ కుటుంబానికి అండగా నిలిచారు. ఈ ఏడాది 3.50 ఎకరాలను కౌలుకు తీసుకుని ఎకరానికి 43 బస్తాల దిగుబడిని సాధించారు. ఒక కుమార్తె, కుమారుడు సంతానం కాగా కుమార్తెకు వివాహం చేశారు. కుమారుడు కూడా ఇటీవలే ఓ ప్రైవేటు ఉద్యోగంలో చేరాడు. రెక్కల కష్టాన్ని నమ్ముకుని ఇద్దరు పిల్లలను చదివించి, వారిని ప్రయోజకులను చేసి పలువురికి స్ఫూర్తిగా నిలిచారు. – ఆళ్లగడ్డ

గిరిజన నేపథ్యం.. సేవా పరిమళం



గోస్పాడు గ్రామానికి చెందిన రాజేశ్వరమ్మ గిరిజన మహిళ. ఈమెకు ఎలాంటి ఆస్తులు లేవు. తల్లిదండ్రుల రెక్కల కష్టం మీద ఇంటర్ వరకు చదివారు. పేదలకు సేవ చేయాలన్న తలంపుతో స్టార్ సొసైటీని స్థాపించారు. బడి బయట ఉన్న బాల కార్మికులను, అనాథ పిల్లలను అక్కున చేర్చుకొని వారికి ఆశ్రయం కల్పించారు. ఈమె సేవలకు మెచ్చి స్టార్ సొసైటీకి ప్రభుత్వం బాల కార్మిక పాఠశాలను మంజూరు చేసింది. అలాగే 2017 నుంచి 2021 వరకు రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలుగా పని చేసే అవకాశం కల్పించింది. పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఈమె రాష్ట్ర ఉత్తమ మహిళ అవార్డును కూడా అందుకున్నారు. – నంద్యాల

చిన్న నాటి కల సాకారం

కింది చిత్రంలో భర్త, పిల్లలతో ఉన్న ఈమె పేరు మాలానీ. కోవెలకుంట్ల పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వర్తిస్తున్నారు. కడప పట్టణానికి చెందిన ఈమె ఎంసీఏ పూర్తి చేశారు. భర్త షేక్ నసీరుద్దీన్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. భర్త ప్రోత్సాహం, పట్టుదలతో ఈమె 2017లో ఎస్ఐ ఉద్యోగం సాధించి, చిన్ననాటి కలను నెరవేర్చుకున్నారు. మొదట కోవెలకుంట్ల మండలం రేవనూరు పోలీస్‌స్టేషన్‌లో పనిచేశారు. మహిళలు వంటింటికే పరిమితమన్న భావన గతంలో ఉండేది. నేడు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో మగువలు రాణిస్తున్నారు. ఇందుకు ఎస్ఐ మాలానీ నిదర్శనం. – కోవెలకుంట్ల



వ్యాపారంలో 'హేమ' సంతకం



పొదుపు సంఘంలో ఉంటూ తన వ్యాపారాన్ని విస్తరించి 40 మందికి ఉపాధి చూపుతున్నారు హేమలత. ఎమ్మిగనూరు పట్టణం సోమప్ప నగర్‌కు చెందిన ఈమె 15 ఏళ్ల క్రితం తినబండరాలు (చెక్కీలు, చుట్టలు) తయారు చేసే కుటీర పరిశ్రమను స్థాపించారు. కోవిడ్ విపత్తులో ఈ పరిశ్రమను మూసివేశారు. పర్యావరణానికి హితంగా ఉండే నాన్ ఓవెన్ బ్యాగులు తయారీకి శ్రీకారం చుట్టారు. వీటిని తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రలోని పలు ప్రాంతాలను సరఫరా చేస్తున్నారు. ఏడాదికి రూ.80 లక్షల వ్యాపారం జరుగుతోంది. ఆత్మవిశ్వాసంతో ప్రయత్నిస్తే మహిళలు కూడా ఉత్తమ ఫలితాలను సాధించవచ్చని హేమలత నిరూపించారు. ఈమె విజయం పొదుపు మహిళలే కాదు వ్యాపార దక్షత ఉన్న స్త్రీలందరికీ స్ఫూర్తిదాయకమే. – ఎమ్మిగనూరు

చీకటిని పారదోలుతూ..

పొయ్యిపై కాఫీ తయారు చేస్తున్న ఈమె పేరు నారాయణమ్మ. కొలిమిగుండ్ల మండలం పెట్నికోటలో ఉంటున్నారు. ఈమెకు 11 నెలల వయస్సులో ఆటలమ్మ సోకడంతో రెండు కళ్లు కనిపించకుండా పోయాయి. కంటికి రెప్పలా చూసుకున్న తల్లిదండ్రులు మృతి చెందారు. సోదరుడు కుటుంబంతో కలిసి ఇంకో ప్రాంతంలో స్థిరపడ్డాడు. కనీసం ఉండటానికి ఇల్లు కూడా లేదు. అయినా ఈమె అధైర్య పడలేదు. కష్టాలకు కుంగిపోలేదు. ఊరి మధ్యలో ఉన్న గ్రామ చావిడిని ఆవాసంగా చేసుకున్నారు. ప్రభుత్వం ఇస్తున్న పింఛన్‌తో ఎవరి అండ లేకుండానే ఒంటరి పోరాటం చేస్తున్నారు. చూపు లేక పోయినా ఎవరి ఆధారం లేకుండా తన పనులు తానే చక్కగా చేసుకుంటూ పలువురికి ఆదర్శంగా నిలిచారు. – కొలిమిగుండ్ల



అమ్మా.. నీకు వందనం



పుట్టెడు దుఃఖాన్ని కడుపులో దాచుకొని పిల్లలను కంటికి రెప్పలా చూసుకుంటున్న ఈమె పేరు హిమాంబీ. తుగ్గలి మండలం గిరిగెట్ల గ్రామానికి చెందిన ఈమెకు 25 ఏళ్ల క్రితం డోన్‌కు చెందిన ఖలీల్‌తో మేనరికపు వివాహం జరిగింది. వీరికి కుమారులు ఖాదర్‌బాషా(21), చాంద్‌బాషా(19) ఉన్నారు. పుట్టుకతో వీరు బాగా ఉన్నా తర్వాత కొద్ది రోజులకే కాళ్లు, చేతులు పడిపోయి బుద్ధిమాంద్యంతో మంచానికే పరిమితమయ్యారు. ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న ఖలీల్ అనారోగ్యంతో మృతి చెందడంతో హిమాంబీకి కష్టాలు మొదలయ్యాయి. భర్త పోయిన దుఃఖంలో ఉన్న ఆమె పుట్టిల్లు గిరిగెట్లకు చేరుకుని తల్లిదండ్రుల వద్ద పిల్లలను విడిచి కూలికి వెళ్లేవారు. పక్ష వాతం సోకి తల్లి మృతి చెందగా, తండ్రి వయసు మీద పడి పనికి వెళ్లలేని స్థితి. కదలలేని పిల్లలు, తండ్రి సంరక్షణ కోసం ఆమె ఇంటి వద్దే ఉండాల్సి వస్తోంది. ప్రభుత్వం ఇస్తున్న పింఛన్‌తో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. బిడ్డలను కంటికి రెప్పలా కాపాడుకుంటున్న ఆ తల్లి ప్రేమ వెలకట్టలేనిది. – తుగ్గలి

వ్యాపారంలో 'రాణి'ంపు



ఈ మహిళ పేరు ఎ.సుధారాణి. కర్నూలు బుధవారపేటలో జ్యువెలరీ వ్యాపారాన్ని నిర్వహిస్తున్నారు. ఈమె చదివింది పదో తరగతి మాత్రమే. అయితేనేం.. వ్యాపార సామ్రాజ్యాన్ని అంతర్జాతీయ స్థాయికి విస్తరింప చేశారు. అమెరికా, కెనడా తదితర దేశాల్లో 500 మంది ఎన్‌ఆర్ఐ కస్టమర్లు ఉన్నారంటే ఆశ్చర్యం కలగక మానదు. ఈమెకు బంగారంలో ఎక్స్‌పోర్ట్(ఎగుమతులు), ఇన్‌పోర్టు (దిగుమతి) లైసెన్స్ ఉంది. గృహిణిగా బాధ్యతలను నిర్వర్తిస్తూనే బంగారం, వజ్రాల వ్యాపారంలో విశేషంగా రాణిస్తున్నారు. – కర్నూలు(అగ్రికల్చర్)

చదువుల సంకల్పం..ఓడిన వైకల్యం

ఎక్కువ సేపు కూర్చోలేని, నిలబడలేని కత్తి వెంకటమ్మ పీహెచ్‌డీ పూర్తి చేసి ఆదర్శంగా నిలిచారు. కొత్తపేటలో నివాసం ఉంటున్న ఈమె జన్యులోపంతో జన్మించారు. చదువులో చురుగ్గా ఉంటూ శ్రీశైలం ఉన్నత పాఠశాలలో 10వ తరగతి వరకు, సున్నిపెంట జూనియర్ కళాశాలలో ఇంటర్ చదివారు. బీఏ డిగ్రీ తర్వాత నంద్యాలలో బీఈడీ పూర్తి చేశారు. శ్రీశైలంలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో ఎంఏ, అదే వర్సిటీలో 2016లో పీహెచ్‌డీ పూర్తి చేసి, వర్సిటీ గ్రాంట్ కమిషన్ అందించే నేషనల్ ఫెలోషిప్‌కు ఎంపికయ్యారు. అన్ని అవయవాలు బాగున్న విద్యార్థులు సరిగ్గా చదువుకోలేని ఈ రోజుల్లో జన్యులోపం ఉన్న కత్తి వెంకటమ్మ పీహెచ్‌డీ పూర్తి చేసి స్ఫూర్తిగా నిలిచారు. – శ్రీశైలం



విజయ పాల ధర రూ.1 పెంపు

కర్నూలు(అర్బన్): పాల సేకరణ, డీజిల్, ప్యాకింగ్, మెటీరియల్ ధరలు, ఇతర వ్యయాలు పెరిగిన కారణంగా అనివార్య పరిస్థితుల్లో విజయ బ్రాండ్ పాల ధరను రూ.1 పెంచుతున్నట్లు కర్నూలు విజయ డెయిరీ మేనేజర్ ఎస్.విజయకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయ గోల్డ్ 500 మిల్లీలీటర్ల ప్రస్తుత ధర రూ.33 కాగా, సవరించిన ధర రూ.34.. విజయ టోన్డ్ మిల్క్ రూ.26 నుంచి రూ.27కు, కర్డ్ రూ.32 నుంచి రూ.33కు పెంచామన్నారు. విజయ పాల ఉత్పత్తులను ఎప్పటిలాగే ఆదరించాలని కోరారు.



రథాన్ని లాగుతున్న భక్తజనం

రమణీయంగా సాగిన అహోబిలేశుడి రథోత్సవం


రథంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీప్రహ్లాదవరదుడు

ఆళ్లగడ్డ: అహోబిల క్షేత్రం తిరువీధుల్లో శ్రీ ప్రహ్లాదవరదుడు ఉభయ దేవేరులతో కలసి రథంపై నుంచి అభయమివ్వగా భక్తకోటి పరవశించిపోయింది. అహోబిలేశుడి రథం ముందుకు కదలగా నల్లమల గిరులు గోవింద నామస్మరణతో మారుమోగాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం దిగువ అహోబిలంలో నిర్వహించిన రథోత్సవం కనులపండువగా సాగింది. ముందుగా ఉత్సవమూర్తులకు అభిషేకం నిర్వహించి పట్టు పీతాంబరాలతో ముస్తాబు చేసి విశేష పూజలు చేపట్టారు. అనంతరం స్వామిఅమ్మవార్లను ఊరేగింపుగా తోడ్కొని వచ్చి వివిధ రకాల పుష్పాలతో అలంకరించిన రథంపై ఉంచారు. అహోబిల మఠం 46వ జియర్ శ్రీ రంగనాథ యతీంద్ర మహాదేశికన్ శాస్త్రోక్తంగా రథాంగ పూజలు నిర్వహించి రథోత్సవాన్ని ప్రారంభించారు. రథం ముందు భక్తి పారవశ్యంతో నిర్వహించిన కోలాటాలు, భజనలు, డప్పుల వాయిద్యాలు, భాజా భజంత్రీల మంగళ వాయిద్యాలు, ఢమరుక నాదాలు, కళాకారుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. రథశాల వద్ద నుంచి క్షేత్రం మాడవీధుల్లో అహోబిలేశుడు విహరిస్తుండగా భక్తజనం పులకించిపోయింది.

స్థానిక ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్లు 1,178

కర్నూలు(అర్బన్): ఈ నెల 13వ తేదీన జరగనున్న స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు మొత్తం ఓటర్లు 1,178 మంది ఉన్నారు. ఇందులో అత్యధిక మంది వైఎస్సార్‌సీపీ గుర్తుపై గెలిచిన వారే కావడం గమనార్హం. రాజకీయ పార్టీల వారీగా ఓటర్ల బలబలాలను చూస్తే ... బీజేపీకి 08, సీపీఐ 04, స్వతంత్రులు 26, జనసేన 01, తెలుగుదేశం 134 కాగా, వైఎస్సార్‌సీపీ 1,005 మంది ఉన్నారు. ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీకి జిల్లాలోని 14 అసెంబ్లీ నియోజకవర్గాల్లో బనగానపల్లెలో అత్యధికంగా 20 మంది ఓటర్లు ఉండగా, అత్యల్పంగా శ్రీశైలం నియోజకవర్గంలో ఒక్క ఓటరు మాత్రమే ఉన్నారు. ఈ ఎన్నికలకు సంబంధించి ఉమ్మడి కర్నూలు జిల్లాలోని కర్నూలు, ఆదోని, పత్తికొండ, నంద్యాల, డోన్, ఆత్మకూరు డివిజన్ కేంద్రాల్లోని ఆర్డీఓ కార్యాలయాల్లో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. కాగా ... మొత్తం 1,178 మంది ఓటర్లలో ఎంపీటీసీలు 791, జెడ్పీటీసీలు 53, అర్బన్ స్థానిక సంస్థలకు చెందిన కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, ఎక్స్ అఫీషియో మెంబర్లు 334 మంది ఉన్నారు.

ఉరుకుంద ఆలయ ఈఓగా రామాంజనేయులు


ఈఓ రామాంజనేయులు

కర్నూలు కల్చరల్: కౌతాళం మండల పరిధిలోని ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయానికి ఇన్‌చార్జ్ ఈఓగా అనంతపురం జిల్లా దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ రామాంజనేయులును నియమించారు. ఈమేరకు దేవదాయ శాఖ కమిషనర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇక్కడ ఈఓగా విధులు నిర్వహిస్తున్న వాణి రెండు నెలల పాటు వ్యక్తిగత సెలవుల్లో వెళ్లడంతో ఆమె స్థానంలో ఆయనను నియమించారు. ఈ నేపథ్యంలో ఈఓగా బాధ్యతలు స్వీకరించిన రామాంజనేయులును మంగళవారం ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ నాగరాజ్ మర్యాదపూర్వకంగా కలిశారు.

జననం నీవే.. గమనం నీవే
సృష్టివి నీవే.. ప్రతిసృష్టివి నీవే
కర్తవు నీవే.. కర్మవు నీవే
ఓ మహిళా నీకు వందనం!
'యత్ర నార్యంతు పూజ్యంతే
రమంతే తత్ర దేవతా'
ఎక్కడైతే స్త్రీ గౌరవం పొందుతుందో
అక్కడే సకల దేవతలు కొలువై
ఉంటారు.
అంతర్జాతీయ మహిళా
దినోత్సవ శుభాకాంక్షలు!


జీవన ప్రయాణంలో తోడుగా .. ఆత్మకూరు డిపోలో కండెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న సరస్వతి


కష్టాలు అధిగమించి.. కర్నూలు మాధవనగర్‌లో చెప్పులు కుడుతున్న అయ్యమ్మ


శక్తి.. యుక్తి.. కర్నూలు మద్దూర్ నగర్‌లో చేపలు విక్రయిస్తున్న వెంకటమ్మ


అన్నింటా మేమే.. కర్నూలులోని పార్కురోడ్డు పెట్రోల్ బంక్‌లో పనిచేస్తున్న సునీత

– సాక్షిఫొటోగ్రాఫర్, కర్నూలు

మహిళకు పట్టాభిషేకం

మహిళకు రాష్ట్ర ప్రభుత్వం పట్టం కడుతోంది. మహిళా సాధికారత, అభివృద్ధే ధ్యేయంగా అన్నింటా వారికి ప్రాధాన్యత ఇస్తోంది. విద్య, ఉపాధి, ఉద్యోగం, ఆర్థిక, సామాజిక రంగాలతో పాటు రాజకీయాల్లో కూడా అవకాశాలు కల్పిస్తోంది. నామినేటెడ్ పదవులు, వివిధ కాంట్రాక్ట్ పనుల్లో పెద్దపీట వేస్తోంది. దీంతో ఒకప్పుడు వంటింటికి పరిమితమైన మహిళ నేడు అన్నీ తానై కుటుంబంలో, సమాజంలో కీలక పాత్ర పోషిస్తోంది. ఎందరికో ఆదర్శంగా నిలుస్తోంది.

- మహిళా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట
- స్థానిక సంస్థలు, నామినేటెడ్ పదవులు, కాంట్రాక్ట్ పనుల్లో 50 శాతం అవకాశాలు
- రాజకీయంగా ప్రోత్సాహం
- పౌష్టికాహారం, ఆరోగ్యం, విద్య, వైద్యం, సంరక్షణకు ప్రాధాన్యత





కర్నూలు(రాజ్‌విహార్): వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక మహిళాభివృద్ధి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. స్త్రీనే ఇంటి యజమానురాలిగా 90 శాతం పథకాలు వారి పేరునే మంజూరు చేస్తున్నారు. చట్ట సభల్లో ప్రాధాన్యత, స్థానిక సంస్థల ఎన్నికలు, నామినేటెడ్ పదవులు, కాంట్రాక్టు పనుల్లో 50 శాతం వారికే కేటాయిస్తున్నారు. అంతేకాకుండా పుట్టిన పాపాయి నుంచి వృద్ధురాలి వరకు వారి సంక్షేమం, పౌష్టికాహారం, ఆరోగ్యం, విద్య, వైద్యంకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారు.

సంక్షేమ పథకాలు ఇలా..

స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఆరేళ్ల వయస్సులోపు పిల్లలకు పౌష్టికాహారం అందించడం, రక్తహీనత నివారణ, బరువు, ఎత్తు పెంచేందుకు చర్యలు చేపట్టారు. బాలల సంరక్షణ కేంద్రం ద్వారా అనాథలను చేరదీసి పోషణ చూస్తున్నారు. గర్భిణులు, బాలింతలకు గుడ్లు, పాలు, రక్తపరీక్షలు, మధ్యాహ్న భోజనం ,ఐరన్ మాత్రలు, పౌష్టికాహారం అందిస్తున్నారు. సామూహిక సీమంతం చేసి ధైర్యం నింపుతున్నారు.

- బాలికల సంరక్షణ యూనిట్‌తో 18 ఏళ్లలోపు అమ్మాయిలను పునరావాస కేంద్రంలో వివిధ రంగాల్లో శిక్షణ ఇచ్చి, స్వయం ఉపాధి చూపుతున్నారు.
- ఎదిగే ఆడపిల్లల కోసం వైఎస్ఆర్ కిశోరి వికాసం పథకం కింద 9 రకాల సేవలందిస్తున్నారు.

దిశ వన్ స్టాప్ సెంటర్

స్త్రీలకు హింస, వేధింపుల నుంచి రక్షణ కల్పించేందుకు సీఎం వైఎస్ జగన్ దిశ చట్టం తెచ్చారు. వన్ స్టాప్ సెంటర్ ద్వారా ర్యాగింగ్, వేధింపులు, అత్యాచారాలు, హింస, లైంగిక వేధింపుల నుంచి రక్షణ కోసం న్యాయ, పోలీసు, డాక్టర్ వంటి సేవలందిస్తున్నారు.

ఫిర్యాదుల కోసం టోల్‌ఫ్రీ నంబర్లు..

స్త్రీ, శిశు సంరక్షణ కోసం పలు రకాల ఉచిత ఫోన్ నంబర్లు అందుబాటులో ఉన్నాయి. వాటిలో 181 (ఉమెన్), 1098 (చైల్డ్), 112, 100, 1091, 08518, 255057(పోలీసు సహాయం కోసం) 24గంటలూ పనిచేస్తాయి.

ఉమ్మడి జిల్లాలో వివిధ విభాగాల్లో స్త్రీ, పురుషుల గణంకాలు

విభాగం	మొత్తం సంఖ్య	మహిళలు	పురుషులు
జిల్లా జనాభా	45.58 లక్షలు	22.65 లక్షలు	22.93 లక్షలు
జిల్లా ఓటర్లు	33.23లక్షలు	16.76లక్షలు	16.46 లక్షలు
ఉపాధ్యాయులు, లెక్చరర్స్, బోధనా సిబ్బంది	26,000	12,800	13,200
ఉద్యోగులు, అధికారులు	35,630	16,746	18,884
డాక్టర్లు, మెడికోస్	8,000	4,300	3,700
నర్సులు, పారా మెడికల్	10,200	10,200	----
ఆర్టీసీ కండక్టర్లు	1,300	425	875
నామినేటెడ్ చైర్మన్లు, డైరెక్టర్లు	30+148	15+76	15+72
గ్రామ సర్పంచ్‌లు	970	485	485
వార్డు సభ్యులు	9,984	4,992	4,992
మున్సిపల్ మేయర్, చైర్మన్‌లు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు	302	151	151
పొదుపు సంఘాలు	83 వేలు	8.30లక్షలు	----
పింఛన్ అందుకుంటున్న వారు	4.93 లక్షలు	2.81 లక్షలు	2.12 లక్షలు
అమ్మఒడి లబ్ధిదారులు (సుమారు)	4,12,884	4,12,884	----
సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు	23,700	11,850	11,850
అంగన్ వాడీ కేంద్రాల్లో సేవలు పొందుతున్న పిల్లలు, బాలింతలు, పాలిచ్చే తల్లులు	4.34 లక్షలు	2.42 లక్షలు	1.92 లక్షలు (చిన్నారులు)

స్త్రీ, శిశు సంక్షేమానికి అధిక ప్రాధాన్యత

స్త్రీ, శిశు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇచ్చి పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతోంది. జిల్లాలో గర్భిణులు, బాలింతలు, పుట్టిన పిల్లలతో పాటు ఆరేళ్ల వయస్సు వచ్చే వరకు అన్ని విధాలా సంరక్షణ చర్యలు చేపట్టాం. వారిలో రక్తహీనత, పౌష్టికాహార లోపాన్ని నివారించేందుకు పోషకాలతో ఆహారం అందిస్తున్నాం. – పద్మజ, ఐసీడీఎస్ ఆర్‌జేడీ



దివ్యాంగులకు ఉపకరణాలతో ప్రయోజనం

కర్నూలు సిటీ: దివ్యాంగులు తమ దైనందిన కార్యక్రమాలు చేసుకునేందుకు ఉపకరణాలు ఎంతో ఉపయోగపడుతాయని సమగ్ర శిక్ష అదనపు కో–ఆర్డినేటర్ డా.కె వేణుగోపాల్ అన్నారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు అవసరమైన ఉపకరణాల గుర్తింపు శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఏపీ సమగ్ర శిక్ష సహిత విద్య విభాగం ఆధ్వర్యంలో నగరంలోని బీక్యాంపు ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని కె. వేణుగోపాల్ ప్రారంభించి ప్రసంగించారు. వికలత్వ శాతాన్ని బట్టి అవసరమైన పరికరాలను ఉచితంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సహిత విద్య సమన్వయకర్త పి.విజయప్రసాద్ రావు, సహిత విద్య రిసోర్స్ పర్సన్స్, ఫిజియోథెరపిస్టులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణపై అప్రమత్తత అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకులు

నేటిలోగా ఓటర్‌స్లిప్పుల పంపిణీ పూర్తి

- అన్ని చర్యలు చేపట్టిన ఎన్నికల కమిషన్
- ఎన్నికల పరిశీలకులు కోలా భాస్కర్, హరిజవహర్‌లాల్

సాక్షి ప్రతినిధి కర్నూలు: ఎన్నికల నిర్వహణపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని, మొదటిసారి ఎన్నికలు నిర్వహిస్తున్నామనే భావనతో విజయవంతం చేయాలని కర్నూలు, నంద్యాల జిల్లాల నోడల్ అధికారులకు ఎన్నికల పరిశీలకులు పోలాభాస్కర్, హరిజవహర్‌లాల్ సూచించారు. కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో కర్నూలు, నంద్యాల కలెక్టర్లు, ఎస్పీలు కోటేశ్వరరావు, మనజీర్ జిలాన్ శామూన్, సిద్ధార్థ్‌కౌశల్, రఘువీర్‌రెడ్డితో కలిసి ఎన్నికల నిర్వహణపై సమీక్షించారు. ఎన్నికల ఏర్పాట్లు నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలన్నారు. ఓటర్‌స్లిప్‌ల పంపిణీ ఈ నెల 8లోగా పూర్తి కావాలన్నారు. 'మార్క్‌డ్ కాపీ ఆఫ్ ఎలక్టోరల్ రోల్స్' కాపీలను ఆర్‌డీఓలకు పంపాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మల్లికార్జునుడును ఆదేశించారు. 49 మంది అభ్యర్థులతో రాష్ట్రంలో అత్యంత పెద్ద బ్యాలెట్ గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో ఉందని, దీనిపై సూక్ష్మపరిశీలన చేయాలన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని నగరపాలక సంస్థ కమిషనర్ భార్గవ్‌తేజ్‌కు సూచించారు. మరో ఎన్నికల పరిశీలకులు డాక్టర్ హరి జవహర్ లాల్ మాట్లాడుతూ ప్రిసైడింగ్ అధికారి ప్రశాంతంగా విధులు నిర్వహించేలా నోడల్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అందరూ సమష్టిగా విధులు నిర్వహించి ఎన్నికలు విజయవంతం చేయాలన్నారు. పీఓ, ఏపీఓలతో పాటు రూట్ ఆఫీసర్లు, జోనల్ ఆఫీసర్లకు శిక్షణ ఇచ్చి వారిని రిజర్వ్‌లో ఉంచుకోవాలని కలెక్టర్లకు సూచించారు. ఎన్నికల్లో ఏం చేయాలి? ఏం చేయకూడదనే అంశాలపై అందరికీ అవగాహన ఉండాలన్నారు. అంతకు ముందు ఎన్నికల ఏర్పాట్లపై కలెక్టర్లు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పరిశీలకులకు వివరించారు. సిబ్బందికి శిక్షణ పూర్తయిందని, బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేశామని, బ్యాలెట్ పేపర్లు పరిశీలిస్తున్నామని కలెక్టర్‌లు, ఎస్పీలు వివరించారు. సమావేశంలో జేసీ రామసుందర్‌రెడ్డి, ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, డీఆర్వోలు హాజరయ్యారు.

నాటుసారా నిర్మూలనకు సమష్టి కృషి

- సెబ్ అడిషనల్ ఎస్పీ కృష్ణకాంత్ పటేల్

కర్నూలు: జిల్లాలో నాటుసారా నిర్మూలనకు సమష్టిగా కృషి చేస్తున్నట్లు అడిషనల్ ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ పేర్కొన్నారు. ఆపరేషన్ పరివర్తన కార్యక్రమంలో భాగంగా నాటుసారా తయారీ, నిల్వ, మద్యం అక్రమ రవాణా, అమ్మకాలపై ఫిబ్రవరిలో పోలీసు యంత్రాంగం, సెబ్ అధికారులు, స్పెషల్ పార్టీ పోలీసులు సంయుక్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించినట్లు వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా జరిపిన విస్తృత దాడుల్లో నాటుసారాకు సంబంధించి 44 కేసులు నమోదు చేసి 61 మందిని అరెస్టు చేయడంతో పాటు 496 లీటర్ల నాటుసారా, 3, 680 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేసి ఐదు వాహనాలు సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. అలాగే పొరుగు రాష్ట్రాలు కర్ణాటక, తెలంగాణల నుంచి మద్యం అక్రమ రవాణాకు సంబంధించి 108 కేసులు నమోదు చేసి 322 మందిని అరెస్టు చేసి 4,185 లీటర్ల మద్యం, 49 వాహనాలు సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. నాటుసారా రవాణాదారులు నలుగురిని, మద్యం అక్రమ రవాణాదారులు 30 మందిని, గంజాయి రవాణాదారులు 65 మందిని బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు. అలాగే షరతులు ఉల్లంఘించిన ఇద్దరు పాత నేరస్తుల బాండ్లు జప్తు చేసి రూ.22 వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. ప్రజారోగ్యానికి హాని కలిగించే నాటుసారా, మద్యం అక్రమ రవాణా విక్రయాలకు పలుమార్లు పాల్పడే వ్యక్తులపై పీడీ యాక్ట్‌ను కూడా నమోదు చేస్తున్నట్లు మంగళవారం ఓ ప్రకటనలో హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


మృతిచెందిన వడ్డె కల్యాణ్

గోనెగండ్ల: మండల పరిధిలోని హెచ్. కై రవాడి గ్రామ సమీపంలో సోమవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. మరో ఇద్దరు గాయపడ్డారు. ఎస్‌ఐ పి. తిమ్మారెడ్డి తెలిపిన వివరాల మేరకు.. ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన వడ్డె కల్యాణ్ (25) సమీప బంధువు గోనెగండ్ల మండలం ఐరన్‌బండ గ్రామానికి చెందిన వడ్డె రామాంజినేయులు పులకుర్తిలో సుంకులమ్మ అవ్వ దేవర చేస్తున్నాడు. ఈ కార్యక్రమానికి వడ్డె కల్యాణ్ తన ద్విచక్ర వాహనంలో బంధువులు హరికృష్ణ, మధుతో కలిసి బయలుదేరాడు. హెచ్.కైరవాడి గ్రామ సమీపంలో ప్రమాదవశాత్తు పెద్దనేలటూర్ నుంచి శనగ పంట లోడుతో వస్తున్న ట్రాక్టర్‌ను ఢీ కొట్టాడు. ఈ ఘటనలో కల్యాణ్‌కు తీవ్రగాయాలు కాగా హరికృష్ణ, మధుకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వారిని కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కల్యాణ్ మృతిచెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడి భార్య మణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. మృతుడికి ఓ కుమార్తె ఉంది.

సమాజాభివృద్ధిలో మహిళలదే కీలకపాత్ర

- పారిశుద్ధ్య కార్మికులతో కలసి రోడ్లు శుభ్రం చేసిన ఎమ్మెల్యే, మేయర్


కార్మికులతో కలిసి డ్రైనేజీలను శుభ్రం చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని, మేయర్ రామయ్య


మహిళా కార్మికులతో కలసి అల్పాహారం తీసుకుంటున్న ఎమ్మెల్యే, మేయర్

కల్లూరు: సమాజాభివృద్ధిలో మహిళలదే కీలక పాత్ర అని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, నగర మేయర్ బీవై రామయ్య అన్నారు. మంగళవారం నగరంలోని 19వ వార్డు జోహరాపురం రోడ్డు, డ్రైనేజీ కాలువలను ఎమ్మెల్యే, మేయర్ పారిశుద్ధ్య కార్మికులతో కలిసి శుభ్రం చేశారు. అనంతరం మహిళా కార్మికులతో కలిసి అల్పాహారం స్వీకరించారు. అనంతరం వారికి అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపి మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ప్రభుత్వ, నామినేటెడ్ పదవుల్లో వారికి 50 శాతం రిజర్వేషన్ కల్పించడమే కాక రాజకీయంగా ప్రోత్సహిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బి.మహేశ్వర్‌రెడ్డి, వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రాజు, కార్పొరేటర్ లక్ష్మీరెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

